సాక్షి నిజామాబాద్

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



మాయ మాటలు చెప్పేవారిని..

రైతు సంక్షేమమంటూ మాయ మాటలు చెప్పే కాంగ్రెస్ వారిని నమ్మొద్దని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవిత అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /21.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కట్టుదిట్టంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు



రెంజల్(బోధన్): అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హ న్మంతు తెలిపారు. సీపీ సత్య నారాయణతో కలిసి ఆయన ఆదివారం కందకుర్తి అంత ర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. రెవెన్యూ, పోలీసు, ఎక్సయిజ్, అటవీ శాఖలను సమన్వయ పరుస్తూ ఎన్నికలను ఎదుర్కొనేందు కు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉంటాయన్నారు. చెక్‌పోస్టులతో పాటు పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్‌బూత్‌లను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొరుగు రాష్ట్రాల నుండి నిషేధిత పదార్థాలు, మద్యం, నగదు వంటివి అక్రమంగా జిల్లాలోకి రాకుండా కట్టడి చేయడంతో పాటు పక్కరాష్ట్రమైన మహారాష్ట్ర సరిహద్దు జిల్లా అధికారులతో చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కందకుర్తి గోదావరి వంతెనపై నుంచి త్రివేణి సంగమ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. కలెక్టర్ వెంట రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, స్థానిక సర్పంచ్ ఖలీంబేగ్, తహశీల్దార్ రాంచందర్, ఎస్సై ఉదయ్‌కుమార్ ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఫస్ట్



పోతంగల్ (రుద్రూర్): దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడలేవని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా స్పీకర్‌ను ప్రజలు గజమాలతో సన్మానించారు. విద్యార్థులతో కలిసి స్పీకర్ కోలాటం ఆడారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సర్పంచ్ వోలే లక్ష్మీ, ఎంపీపీ సునీత, ఏఎంసీ వైస్ చైర్మన్ రామిరెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, రైతుసమితి మండల అధ్యక్షుడు కిశోర్‌బాబు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న అర్వింద్



నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు రాశులు (ఫైల్)

- ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్న కేంద్రం
- రేపు ప్రధాని మోదీ పాల్గొనే సభను కృతజ్ఞత సభగా మార్చిన రైతులు
- జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు
- మారనున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఇందూరు పర్యటనకు ముందే పసుపు బోర్డు ప్రకటన రావడంపై బీజేపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొంది. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు సాధిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి ఎంపీగా కల్వకుంట్ల కవితపై విజయం సాధించారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఎంపీ అర్వింద్ ఇందూరుకు స్పైసెస్ బోర్డు రీజినల్ కార్యాలయాన్ని తీసుకొచ్చారు. ఇదే ఒరవడితో తాజాగా కేంద్ర ప్రభుత్వం ద్వారా దేశంలోనే ప్రత్యేకంగా పసుపు పంట కోసం బోర్డు ఏర్పాటు చేయిస్తుండడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈ పసుపు బోర్డు అంశం రాజకీయంగా సమీకరణాలను మార్చనుండడంతో ఆయా వర్గాల్లో కాక పుట్టిస్తోంది.

రెండు నెలల్లో జరుగనున్న శాసనసభ ఎన్నికల కోడ్ వెలువడనున్న వారం రోజుల ముందుగా ఈ పసుపు బోర్డు ప్రకటనతో బీజేపీ రేసులో మరింత ముందుకు దూసుకొచ్చినట్లైంది. జిల్లాతో పాటు పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు పార్టీ శ్రేణులతో పాటు పసుపు రైతులు సైతం పాలాభిషేకాలు చేస్తున్నారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి పాల్గొనే సభను పసుపు రైతులు కృతజ్ఞత సభగా మార్చు చేయడం విశేషం.

ప్రధానికి ఎంపీ ధన్యవాదాలు

సుభాష్‌నగర్ : పసుపుబోర్డు ప్రకటించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎంపీ అర్వింద్ ధర్మపురి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. బోర్డు కార్యచరణ దాల్చడంలో కీలకపాత్ర పోషించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న తెలంగాణ ఇన్‌చార్జి, జాతీయ ప్రధానకార్యదర్శి సునీల్ బన్సల్, కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డికి ప్రతి ఒక్క పసుపు రైతు తరుపున కృతజ్ఞతాభివందనలు తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా బోర్డు ఏర్పాటు చేయడం సంతోషకరమని, కేంద్ర ప్రభుత్వం, మోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతుల కల నెరవేరిందని, బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు మంచి రోజులు రానున్నా యని అన్నారు.

చెప్పులు తొడుక్కున్న ముత్యాల మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

పన్నెండేళ్లుగా ఉద్యమం చేస్తున్న మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన రైతు ముత్యాల మనోహర్‌రెడ్డి పసుపు బోర్డు ప్రకటనతో ఇందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో చెప్పులు తొడుక్కున్నారు. ఆయన 2011 నవంబర్ 4 నుంచి చెప్పులు వేసుకోవడం లేదు. పసుపు బోర్డు వస్తేనే చెప్పులు వేసుకుంటానని శపథం చేశారు. ఇన్నాళ్లకు కల సాకారం కావడంతో ఆయన చెప్పులు తొడుక్కున్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద అనేక సార్లు రైతులతో కలిసి ఆందోళనలు చేశారు. 2013లో పసుపు బోర్డు కోసం తిరుపతికి చెప్పులు లేకుండా పాదయాత్ర చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మనోహర్‌రెడ్డికి ఘనంగా సన్మానం చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ, పెద్దోళ్ల గంగారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, ఐటీ విభాగం ఆశిశ్ పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎమ్మెల్సీ కవిత కృషి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పసుపుబోర్డు ప్రకటన చేయడం వెనక ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృషి ఎంతో ఉంది. పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్న సమయంలో ఆమె తెలంగాణలో పసుపు పండించే ప్రాంతాల శాసనసభ్యులతో కలిసి, పసుపు పండించే రాష్ట్రాల సీఎంలను పలు దఫాలుగా కలిశారు. ఇందూరు ప్రాంతంలో పసుపు బోర్డు ఆవశ్యకతను వివరించి, ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకువచ్చారు.

– మార గంగారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్

రైతు సంక్షేమంలో వెనక్కి తగ్గేదే లేదు..



మోదీ ప్రభుత్వం రైతు సంక్షేమం విషయంలో ఏ మాత్రం వెనక్కు తగ్గదు. ఎంపీ అర్వింద్‌పై నమ్మకంతో గెలిపించిన పసుపు రైతుల ఆశలను వమ్ము చేయకుండా ప్రధానమంత్రి మోదీ పసుపు బోర్డు ఏ ర్పాటుకు నిర్ణయించారు. దేశంలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేయడంతో పాటు అంతర్జాతీయ స్థా యిలో భారత కీర్తి ఇనుమడింపచేస్తున్నారు. ఇక్కడి రైతులు పండించిన పంటకు అంతర్జాతీయ స్థాయి లో మార్కెట్ కల్పించే లక్ష్యంతో పసుపు బోర్డు ప్రకటించడంతో పాటు స్వయంగా ప్రధానే ఇక్కడకు వస్తుండడం ఎప్పటికీ మరువలేని విషయం.

– పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

విధివిధానాలు ప్రకటించాలి



ప్రధాని నరేంద్ర మోదీ పసుపుబోర్డును ప్రకటించడం హర్షణీయం. రైతులకు ఎంతో సంతోషానిస్తోంది. విధి విధానాలు వీలైనంత త్వరలో ప్రకటించాలి. బోర్డును నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పసుపు ఎక్కువగా పండించే ఈ ప్రాంత రైతుల కు బోర్డు అందుబాటులో ఉంటుంది. జనవరి వరకు పసుపు దిగుబడులు ప్రారంభమవుతాయి. ఆలోపు కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుని కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీలో రైతులు ఉండేలా చూడాలి. ఎన్నో ఏళ్ల రైతుల ఉద్యమాలకు కేంద్రం స్పందించింది.

– పాట్కూరి తిరుపతిరెడ్డి, జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు

మంచి ధర రావడమే ముఖ్యం



పసుపు బోర్డు వల్ల కలిగే ప్రయోజనాలు ఇప్పట్లో చెప్పలేం. రైతులకు పండించిన పంటకు మంచి ధర లభించిందా లేదా అనేది ముఖ్యం. పసుపు సాగు విస్తీర్ణం తగ్గిస్తున్నారు. ఇందుకు ధర తక్కువే కారణం. బోర్డుతో ధర పెరిగితే బాగుంటుంది.

– డాక్టర్ ఎల్ కిషన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త

ఇది రైతుల విజయం...



మోదీ పసుపు బోర్డు ప్రకటన రైతుల విజయం ఇది. ఎన్నో రకాల పోరాటాల ఫలితమే. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు పోటీ చేయడం కూడా ఇప్పుడు పసుపు బోర్డు ఏర్పాటుకు మూలం. ఇది రైతుల సమష్టి పోరాట ఫలితం.

– గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

చట్టబద్ధత కల్పించాలి...



పసుపుబోర్డును పార్లమెంట్‌లో ఆమోదించి చట్టబద్ధత కల్పించినపుడే పూర్తి స్థాయి ఫలితాలను రైతులు పొందగలుగుతారు. 1986లో 52 పంటలను కలిపి స్పైసిస్ బోర్డును ఏర్పాటు చేసారు. స్పైసిస్ బోర్డు నుంచి పసుపును తొలగించి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తూ చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉంది.

– కోటపాటి నర్సింహం నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పసుపు రైతుల సంఘం

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఎంపీ



ప్రత్యేక బోర్డు ఏర్పాటు అనే అసాధ్యమైన అంశాన్ని సుసాధ్యం చేసిన క్రెడిట్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కే దక్కింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆయన చేసిన పోరాట ఫలితంగా ప్రధాన మంత్రి మోదీ పసుపు బోర్డును ప్రకటించారు. ఇక పసుపు రైతులు హాయిగా నిద్రపోతారు. ప్రతిపక్షాలకు నిద్ర కరువవుతుంది.

– ఏలేటి అన్నపూర్ణ, మాజీ ఎమ్మెల్యే, ఆర్మూర్

చిరకాల వాంఛ నెరవేరింది



పెట్టుబడి వ్యయం కూడా తిరిగి రాని పరిస్థితుల్లో ప్రారంభించిన ఉద్యమం ఫలించి పసుపు రైతుల చిరకాల వాంఛ నెరవేరనుంది. ప్రత్యేక బోర్డుతో రైతులకు లాభం చేకూరనుంది.

– సత్యంరెడ్డి, పసుపు రైతు, ఫత్తేపూర్, ఆర్మూర్ మండలం

రైతుల ఉద్యమ ఫలితమే



రైతుల ఉద్యమ ఫలితంగానే ప్రధాన మంత్రి పసుపు బోర్డు ప్రకటించా రు. ఈ ప్రకటన ఎన్నికల హామీకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చిన రోజున ఫలితం చేకూరుతుంది.

– చిన్నారెడ్డి, పసుపు రైతు, పిప్రి, ఆర్మూర్ మండలం

తెలంగాణలో గిరిపుత్రులకు స్వర్ణయుగం

- సమైక్య పాలనలో బంజారాలకు తీవ్ర అన్యాయం
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- రూ.3కోట్లతో బంజారా భవన్‌కు భూమిపూజ



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

మోపాల్/నిజామాబాద్‌రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బంజారాలకు తీవ్ర అన్యాయం చేయగా, తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన గిరిపుత్రులకు స్వర్ణయుగమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం నగర శివారులోని పాంగ్రాలో రూ.3.10 కోట్లతో నిర్మించనున్న బంజారాభవన్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి భూ మి పూజ చేశారు. ఈ సందర్భంగా భూమారెడ్డి కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సత్యవతి రాథోడ్ మాట్లాడారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో బంజారాల అభ్యున్నతి కోసం ఒక్క పథకం కూడా ప్రకటించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో కాలయాపన చేస్తోందన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ కవిత, గిరిజనుల విజ్ఞప్తి మేరకు బంజారా భవన్‌కు అదనంగా రూ.5కోట్లు సీఎం కేసీఆర్‌తో మంజూరు చేయిస్తానని సభాముఖంగా హామీనిచ్చారు.



బంజారా భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

10 శాతం రిజర్వేషన్లు కేసీఆర్ ఘనత : కవిత

రాష్ట్రంలో బంజారాలకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్లు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. 4 వేల మంది గిరిజన బిడ్డలు ఇంజనీర్లుగా సేవలందిస్తున్నారని, 128 మందికి మెడికల్ కళాశాలల్లో సీట్లు వచ్చాయన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వాలు పక్కదారి పట్టించగా, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వారికే కేటాయిస్తోందన్నారు.

ఎంపీ అర్వింద్ అబద్ధాల కోరు : బాజిరెడ్డి

ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని చెప్పిన ఎంపీ అర్వింద్.. ఐదేళ్లు కావస్తున్నా తీసుకురాలేదని, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామనే అబద్ధాన్ని మరోసారి ప్రధాని మోదీతో చెప్పించేందుకు ఎంపీ సిద్ధమయ్యాడని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అన్ని తండాలకు రోడ్లకు రూ.90కోట్లు మంజూరు చేశామని, 700 మంది గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. పాకాల, రాంచంద్రపల్లె గ్రామాలకు, బంజారా హాస్టల్ గదులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని బాజిరెడ్డి కోరగా, ఆమె బంజారా భవనానికి రూ.5కోట్లు అదనంగా, హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గంగాధర్ గౌడ్, నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీలు రమేష్ నాయక్, సంగీత రాజేందర్, లతా కన్నీరం, జడ్పీటీసీలు కమల నరేష్, బొల్లంక సుమలత గోపాల్‌రెడ్డి, మాన్‌సింగ్, ట్రికార్ చైర్మన్ రాంచందర్ నాయక్, రాష్ట్ర నాయకులు మోహన్ నాయక్, మోహన్ సింగ్, గంగారాం నాయక్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.



పౌరాగఢ్ పీఠాధిపతి బాబుసింగ్‌కు మంత్రి సన్మానం

అధికారం కోసమే బీఆర్‌ఎస్ పని చేస్తోంది..

బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



సీడీని ఆవిష్కరిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం కల్వకుంట్ల కుటుంబం కోసం, అవినీతికి పాల్పడటం, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన జీజీ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన 'ఇందూరు గర్జన' సీడీని విడుదల చేశారు.

ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డును, ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ప్రధాని మోదీ ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ బహిరంగ సభకు రైతులు, యువత, గిరిజనులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడం మానేసిందని, ప్రజాలు బీజేపీని ఆదరించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ధన్‌పాల్ సూర్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ ప్రభారీ పెద్దోళ్ల గంగారెడ్డి, స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి విశేష కృషి

- దేశంలో నంబర్‌వన్ సెక్యులర్ లీడర్ కేసీఆర్
- రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ



మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కే ఆర్ సురేష్‌రెడ్డి

వేల్పూర్: మైనారిటీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. వేల్పూర్ మండలం లక్కోర వద్ద ఏఎస్‌జీ ఫంక్షన్‌హాలులో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ మైనారిటీ మజీదుల అభివృద్ధికి రూ. 3 కోట్ల నిధుల మంజూరు ఉత్తర్వులను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డితో కలిసి మసీద్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి కోసం గతంలో ఏ నాయకుడు కూడా కేసీఆర్ మాదిరిగా ఆలోచన చేయలేదన్నారు. దేశంలోనే నెంబర్‌వన్ సెక్యూలర్ లీడర్ కేసీఆర్ అని కొనియాడారు. ముస్లిం బిడ్డకు రాష్ట్ర తొలి డిప్యూటీ సీఎం, రెండోసారి హోం శాఖ మంత్రి పదవులు ఇచ్చి యావత్ తెలంగాణ ముస్లిం ప్రజలను గౌరవించారని పేర్కొన్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం పిల్లలు విద్యలో ప్రపంచంతో పోటీ పడి ఇంజనీర్లు, డాక్టర్లు, సైంటిస్టులు, పైలట్‌లు, మేధావులు కావాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. గత ప్రభుత్వాలు మైనారిటీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, ఏనాడు వారి అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మైనారిటీలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఐహెచ్‌ఎఫ్ కార్పొరేషన్ చైర్మన్ మధుశేఖర్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, కోటపాటి నర్సింహనాయుడు, ఆర్డీవో వినోద్, బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని బ్రహ్మపురిలో ఉన్న శ్రీవేంకటేశ్వర విద్యాలయం ఏడో తరగతి విద్యార్థులు (1993–1994 బ్యాచ్‌) పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. తమకు విద్యనేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌ రావు, లక్ష్మీరాజ్యం, గాయత్రి, విద్యార్థులు రాజీవ్, హృదయ్, గిరిప్రసాద్, హరిత, శాంత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతోప్రాజెక్ట్‌ వరద, ఎస్కేప్‌ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా 2500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 200, సరస్వతీకాలువ ద్వారా 300, వరద కాలువ ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు అధికారులు వివరించారు.

నేడు జిల్లాస్థాయి యోగా పోటీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా యోగా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 2న బాల్కొండలోని కేసీఆర్‌ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ కార్యదర్శి గంగాధర్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్‌–8 నుంచి అండర్‌–45 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఉదయం.8.30గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 80749 82200, 70131 00164 నంబర్లను సంప్రదించాలని ప్రకటనలో సూచించారు.

మాయమాటలు చెప్పేవారిని నమ్మొద్దు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇబ్బందులే..
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- చిట్టాపూర్‌లో లిఫ్ట్‌ నిర్మాణ పనులకు శంకుస్థాపన



లిఫ్ట్‌ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: రైతు సంక్షేమమంటూ మాయమాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మొద్దని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో రూ.149 కోట్లతో చేపట్టే లిఫ్ట్‌ నిర్మాణ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం స్వయాన రైతైన కేసీఆర్‌కే తెలుసన్నారు. ఆయన రైతుబాంధవుడదని, ఎక్కడో 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం నీటిని రివర్స్‌పంపింగ్‌ ద్వారా ఎస్సారెస్పీకి తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. వ్యవసాయానికి 24గంటలపాటు ఉచిత విద్యుత్‌ అందించడంతోపాటు రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చిట్టాపూర్‌ లిఫ్ట్‌తో చిట్టాపూర్, బాల్కొండ, శ్రీరాంపూర్‌ గ్రామాల ఆయకట్టుకు మేలు జరుగుతుందన్నారు. రైతులు బీఆర్‌ఎస్‌ పార్టీ వెంట ఉండాలని కోరారు. అధికారంలో ఉండగా రైతులను గోసపెట్టిన కాంగ్రెస్‌ ఇప్పుడు ఏదో చేస్తామని మాయమాటలు చెబుతున్నదని విమర్శించారు. ఆగమై కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులకు 3గంటల విద్యుత్‌ సరిపోతుందన్న కాంగ్రెస్‌.. ఇప్పుడు వారిపై సవతితల్లి ప్రేమ ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. లిఫ్ట్‌ ప్రారంభించేందుకు వచ్చిన మంత్రికి రైతులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి, కోటపాటి నరసింహానాయుడు, ఇరిగేషన్‌ సీఈ మధుసూదన్, సర్పంచ్‌ వనజ, ఎంపీటీసీ కవిత, బీఆర్‌ఎస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నిర్వాసితుల ముందస్తు అరెస్ట్‌

- అరెస్టును అడ్డుకున్న మంచిప్ప గ్రామస్తులు



పోలీస్‌ వాహనాన్ని అడ్డుకుంటున్న మంచిప్ప గ్రామస్తులు

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ జిల్లా పర్యటన నేపథ్యంలో మండలంలోని మంచిప్ప రిజర్వాయర్‌ ముంపు నిర్వాసితుల కమిటీ ప్రతినిధులను పోలీసులు ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీస్‌వాహనాన్ని అడ్డుకుని.. ఎందుకు అరెస్ట్‌ చేస్తున్నారని నిలదీశారు. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు. అలాగే అంగన్‌వాడీ యూనియన్‌ నాయకురాలు సూర్యకళను ముందస్తుగా అరెస్ట్‌ చేశారు. అరెస్టయిన వారిలో తూర్పు రాజేశ్, శంకర్‌ నాయక్, గొల్ల శ్రీనివాస్, సత్యనారాయణ, డాన్‌ శ్రీను తదితరులున్నారు.

అరెస్టులను ఖండిస్తున్నాం

మంచిప్ప ముంపు నిర్వాసితులను ముందస్తు అరెస్ట్‌ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్‌ కిసాన్‌ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత డిజైన్‌ ప్రకారం పనులు చేయించి బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఉందని, ప్రాజెక్టులకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. కమీషన్ల కోసం వందల ఏళ్లుగా అక్కడే ఉన్న గిరిజనులను ముంచడం, ప్రతీసారి అరెస్టులు చేయడం సరికాదని, ఈవిషయంలో ఎమ్మెల్యే పునరాలోచన చేయాలని ముప్ప గంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్‌: సభ్యులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ వెటర్నరీ కెమిస్ట్‌ అండ్‌ డ్రగ్గిస్ట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంచాల జ్ఞానేందర్‌ అన్నారు. నగరంలోని అసోసియేషన్‌ కార్యాలయంలో ఆదివారం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డ్రగ్స్‌ కంట్రోల్‌ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు గుండమీది కోటేశ్వర్‌రావు 'యాప్‌ ఆధార తనిఖీలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వచ్చే తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌ ఎలక్షన్లలో అసోసియేషన్‌ మద్దతు ఇస్తున్న గుండమీది కోటేశ్వర్‌రావు ప్యానెల్‌కు చెందిన మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్యానెల్‌ మెంబర్లు కె.రామారావు, అందె కిరణ్‌కుమార్, యోగేష్‌కుమార్, అబ్దుల్‌ అజీజ్, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి సమావేశానికి హాజరు కాగా, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలంచర్ల సాదయ్యయాదవ్, గౌరవాధ్యక్షుడు కె.రామారావు, కోశాధికారి రవీందర్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని సుమారు 50 మంది వెటర్నరీ షాపుల యజమానులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

- తెలంగాణ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ మధుశేఖర్‌



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్‌ మధుశేఖర్‌

ఆర్మూర్‌/పెర్కిట్‌(ఆర్మూర్‌): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ మధుశేఖర్‌ సూచించారు. నిజామాబాద్‌ జిల్లా బాల్‌ బ్యాట్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 42వ రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ బాల బాలికల బాల్‌ బ్యాట్మింటన్‌ టోర్నీని పట్టణంలోని ఆల్ఫోర్స్‌ హైస్కూల్‌లో మధుశేఖర్‌ ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల నుంచి తొమ్మిది బాలుర జట్లు, ఎనిమిది బాలికల జట్లు పోటీ పడనున్నట్లు క్రీడల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాకాధికారి ముత్తన్న, బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, నిజామాబాద్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానస గణేశ్, బీ.శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, బయ్యన్న, భాస్కర్‌గౌడ్, రాజేశ్వర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



నవీపేట: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ మండలంలోని అభంగపట్నం గ్రామస్తులకు సూచించారు. 2018లో అభంగపట్నం గ్రామాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించడంతో అధికారులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక ప్రాంతాల్లో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల కోసం ఓ వర్గంపై బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు అందాయన్నారు. గ్రామంలో విచారణ చేపట్టగా ఎలాంటి బెదిరింపులకు పాల్పడనట్లు తేలిందన్నారు. వారి వెంట తహసీల్దార్‌ ధన్వాల్, సర్పంచ్‌ రమాదేవి ఉన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం



బెల్టులు, సర్టిఫికెట్లు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌ల ప్రమోషన్‌ టెస్ట్‌ను నగరంలోని బీఎల్‌ఎన్‌ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు.

ప్రతిభచూపిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా హాజరైన నుడా చైర్మన్, జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, జిల్లా కార్యదర్శిమనోజ్, గిరిజ ఆస్పత్రి వైద్యులు డాక్టర్‌ శ్రీనివాస్, లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు విజయానంద్, మాస్టర్స్‌ రమణ, విష్ణు, సురేశ్, నందకిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

'పునశ్చరణ'ను సద్వినియోగం చేసుకోవాలి

- దేవాదాయ సహాయ కమిషనర్‌ సుప్రియ



అర్చకులతో అసిస్టెంట్‌ కమిషనర్‌ ఎన్‌ సుప్రియ

నిజామాబాద్‌ సిటీ: దేవాలయాల్లో ఆచరించే పూజావిధానాలపై అర్చకులకు నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌ ఎన్‌.సుప్రియ అన్నారు. నగరంలోని మాధవనగర్‌ సాయిబాబా ఆలయంలో ఎండోమెంట్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా దూపదీప నైవేద్యం పథకం అర్చకులకు ఏర్పాటు చేసిన పునశ్చరణ తరగతులను ఆమె ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. మూడురోజులపాటు కొనసాగనున్న తరగతులకు ప్రతి అర్చకుడూ హాజరు కావాలన్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆలయాలకు వచ్చేలా భక్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం రోజున శైవ, వీరశైవ అర్చకులకు తరగతులు ఉంటాయని, వారు మాత్రమే హాజరుకావాలన్నారు. అనంతరం సహాయ కమిషనర్‌ను సంఘం అధ్యక్షుడు రాచప్ప సన్మానించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ బి.కమల, ఈవోలు రాంరవీందర్‌గుప్తా, వేణు, వోగేటి శ్రీధర్, ఉమ్మడి జిల్లా దూపదీప నైవేద్యం అర్చకుల సంఘం అధ్యక్షుడు రాచప్ప మహరాజ్, అంజనప్ప, శిక్షకులు కూచి మాణిక్యంశర్మ, జయరాజ్‌ జోషి, భాష్యం కృష్ణమూర్తి, వేదపండితులు మన్మోహన్‌ శర్మ, శ్యామ్‌ శర్మ, రాహుల్‌శర్మ, నవీన్‌శర్మ, డిప్యుటేషన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరికొండ: తపాలశాఖ ఆధ్వర్యంలో సిరికొండలోని సత్యశోధక్‌ పాఠశాలలో 'దీన్‌దయాళ్‌ స్పర్శ్‌ యోజన' రాష్ట్ర స్థాయి జనరల్‌ నాలెడ్జ్‌ పోటీపరీక్షను ఆదివారం నిర్వహించారు. తపాలశాఖ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ రాజనర్సాగౌడ్‌ ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడారు. ఫిలాటెలిక్‌ డిపాజిట్‌ ఖాతా ఉన్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో స్టాంపులసేకరణ అలవాటును పెంపొందించి, వారిలోని ప్రతిభానైపుణ్యాలను మెరుగు పరచ్చడంతో పాటు విజేతలకు రూ.6వేల నగదును అందజేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. ధర్పల్లి, ఇందల్‌వాయి సబ్‌ పోస్ట్‌ మాస్టర్లు నవీన్, సృజన్, ప్రిన్సిపాల్‌ నర్సయ్య, గోపాల్, స్నేహిత్, లింగం, ఉపాధ్యాయులు గంగారెడ్డి, రవి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

నిజామాబాద్‌ రూరల్‌ : నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ యెండల వరప్రసాద్‌పై ఆదివారం గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో గణేశ్‌ నిమజ్జన విధులు నిర్వర్తించి రెండురోజుల క్రితం వచ్చిన వరప్రసాద్‌పై దాడి ఘటన పలుఅనుమానాలకు తావిస్తోంది. వరప్రసాద్‌ ఇటీవలే హెడ్‌ కానిస్టేబుల్‌ శిక్షణ పొందివచ్చి రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్‌కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- దానధర్మాల్లో వారికి ఎవరూ సాటిలేరు
- మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ కవిత
- ఆర్యవైశ్య సంఘం నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బిగాల, బాజిరెడ్డి

నిజామాబాద్‌నాగారం: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ నూతన భవనాన్ని (బిగాల కృష్ణమూర్తి భవన్‌) మంత్రి, ఎమ్మెల్సీతోపాటు ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్‌ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఎంతో ఆత్మీయతతో ఘనంగా స్వాగతం పలికిన ఆర్యవైశ్య ఆడబిడ్డలకు ధన్యవాదాలు తెలిపారు. పుణ్యక్షేత్రాల్లో అన్నసత్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అన్నం పెడుతున్న ఘనత ఆర్యవైశ్యులదేనని అన్నారు. ఆర్యవైశ్యుల్లోని పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి ఇచ్చి ఆదుకుంటున్నదన్నారు. ఆర్యవైశ్య భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటిన్నర ఇచ్చినట్లు తెలిపారు. అర్బన్‌ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా లక్షలాది రూపాయలు ఇచ్చే గుణమున్న వ్యక్తిగా నిలిచిపోతారన్నారు. అంతకుముందు ఆర్యవైశ్య మహిళలు సాంప్రదాయ నృత్యాలు, బతుకమ్మ పాటలతో అతిథులకు ఘనస్వాగతం పలికారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. అనంతరం ముఖ్యఅతిథులు వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

భవన నిర్మాణానికి రూ. 75లక్షలు సహాయంచేశా

పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి తనతండ్రి కృష్ణమూర్తి పేరు మీద రూ.75లక్షలు సహాయం చేసినట్లు ఎమ్మెల్యే బిగాల తెలిపారు. ఒక వైపు నగర అభివృద్ధికి కృషి చేస్తూ.. మరోవైపు అన్ని కుల సంఘాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్‌ దండు నీతూకిరణ్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రామ్‌దయానంద్‌గుప్తా, వికారాబాద్‌ మున్సిపల్‌ చైర్మన్‌ మంజులాగుప్తా, వీజీ గౌడ్, సంఘం అధ్యక్షుడు కొండ వీరశేఖర్‌ గుప్తా, ప్రధానకార్యదర్శి సంపత్‌గుప్తా, కోశాధికారి వెంకటేశ్‌గుప్తా, రవికుమార్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

సెల్‌ఫోన్‌ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాగి శివ తన సెల్‌ఫోన్‌ పోగొట్టు కోగా, సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఆచూకీని కనుగొని ఫోన్‌ను అతడికి అప్పగించినట్లు ఎస్సై గణేశ్‌ ఆదివారం తెలిపారు. శివ గత నెల 26న ఫోన్‌ పోగొట్టుకుని సీఈఐఆర్‌ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడంతో అతడి ఫోన్‌ను గుర్తించి అప్పగించామన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



మోర్తాడ్‌(బాల్కొండ): మండలంలోని దొన్కల్‌క్రాస్‌ రోడ్డు వద్ద ఆదివారం ఓ కారు దగ్ధమైంది. మామిడి లుక్‌ అనే వ్యక్తి ఎలీషా, దేవకుమార్‌తో కలిసి కారులో పెర్కిట్‌ నుంచి మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌వైపు వెళ్తుండగా.. ఇంజిన్‌లో నుంచి పొగలు రావడంతో వారు కారు దిగి దూరంగా వెళ్లారు. కొద్దిసేపట్లోనే మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్‌ ఇంజిన్‌ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. బాధితుడు లుక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌: పట్టణంలోని రాంగనగర్‌ కాలనీనికి చెందిన రాణి ఐదురోజుల క్రితం ఇంటికి తాళం వేసి కామారెడ్డిలోని బంధువుల ఇంటికి వెళ్లగా చోరీ జరిగింది. రాణి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన కాలనీవాసులు పోలీసులతోపాటు బాధితురాలికి సమాచారం అందించారు. రాణి ఇంటికి వచ్చి పరిశీలించగా, రూ.లక్షా ఆరువేల నగదుపాటు తులన్నర బంగారు నగలు, 20తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



గంట కృష్ణారెడ్డి (ఫైల్‌)

నందిపేట్‌(ఆర్మూర్‌): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఐదునెలలపాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన కృష్ణారెడ్డి(22) మృతి చెందాడు. నందిపేటకు చెందిన కృష్ణారెడ్డి ఐదునెలల క్రితం రాత్రివేళ నిజామాబాద్‌ నుంచి నందిపేటకు వస్తుండగా విజయనగరం గ్రామం వద్ద రోడ్డుపై ఉన్న వడ్లకుప్పను ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించిగా, రెండు నెలల చికిత్స అనంతరం వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌ తీసుకువెళ్లారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలో ఉన్న కృష్ణారెడ్డి పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు.

అధికారుల తీరుపై ఆగ్రహం

రోడ్లపై వరికుప్పలు పోయడం కారణంగా వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని, గతంలో పలువురు మృతి చెందిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు భద్రతాచర్యలను కఠినంగా అమలు చేయాలని, అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

శోభాయాత్రలో ఉద్రిక్తత



పోలీసులతో వాగ్వాదానికి దిగిన యువకులు

భిక్కనూరు: మండల కేంద్రంలో నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఉద్రిక్తత నెలకొంది. డీజే విషయంలో పోలీసులు, యువకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరులోని కుమ్మరి గల్లీకాలనీలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని డీజేలను పోలీస్‌ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమ డీజేలు తమకు ఇవ్వాలని కోరుతూ యువకులు తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద వినాయక విగ్రహాలను ఉంచి ధర్నా చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సుమారుగంటపాటు పోలీసులు, యువకులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌ అక్కడికి చేరుకొన్నారు. ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదని, అల్లర్లకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం యువకులు డీజేలను తీసుకువచ్చి నిమజ్జన శోభాయాత్రను కొనసాగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలం అన్నారం శివారులో ఆదివారం ఆటో, టీవీఎస్‌ ఎక్సెల్‌ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగదాంబతండాకు చెందిన భూక్యా రాజునాయక్(50) ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజునాయక్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూర్‌లో ఒకరికి తీవ్రగాయాలు..

భిక్కనూరు: భిక్కనూరు పట్టణంలో ప్యాక్లెయిన్‌ను వెనుక నుంచి బైక్‌ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామేశ్వరపల్లికి చెందిన పాల్‌ బైక్‌పై వెళ్తుండగా, రామాయంపేట వైపు ముందు వెళ్తున్న ప్యాక్లెయిన్‌ను డ్రైవర్‌ స్పీడ్‌బ్రేకర్‌ వద్ద బ్రేక్‌ వేశాడు. వెనకాలే ఉన్న బైక్‌ ఢీకొనడంతో పాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.